సాక్షి అనకాపల్లి

శనివారం : 20 : జనవరి : 2024



అమ్మవారి సంబరం 8లో

యలమంచిలి కనకమహాలక్ష్మి అమ్మవారి నెలరోజుల పండగ ఘనంగా జరిగింది. లక్ష మందికిపైగా అమ్మవారిని దర్శించారు.



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు, నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు గరిష్టం 29.7 నుంచి 29.8, కనిష్టం 22 నుంచి 23 డిగ్రీలు, తేమ 75 నుంచి 77 శాతం నమోదవుతాయని, గాలి 4 కిలోమీటర్ల వేగంతో వీస్తుందని పేర్కొన్నారు.

అగ్రగామిగా ఏయూ

- రాష్ట్ర ప్రభుత్వ చొరవతో నాలుగేళ్లలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు
- విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక కోర్సులు
- ఉపకులపతి ప్రొ.ప్రసాదరెడ్డి నేతృత్వంలో జాతీయ స్థాయిలో ఖ్యాతి
- ఆవిష్కర్తలుగా విద్యార్థులు.. స్టార్టప్‌లకు హబ్‌గా విశ్వవిద్యాలయం
- ప్రతి అడుగూ.. యూనివర్సిటీ ప్రగతి పథం వైపు
- ఏయూ.. ఓ దెయ్యాల కొంప అంటూ ప్రతిష్టను దిగజార్చిన టీడీపీ నేతలు
- ఇప్పుడు జాతీయ స్థాయిలో తొలి 3 యూనివర్సిటీల్లో ఒకటిగా నిలిచిన ఏయూ





ఆ-హబ్



అల్గారిథమ్ భవనం

సాక్షి, విశాఖపట్నం : ప్రైవేటు వర్సిటీల అడుగులకు మడుగులొత్తుతూ ప్రతిష్టాత్మక యూనివర్సిటీని తెలుగుదేశం పార్టీ పట్టించుకోకపోవడంతో మసకబారిన ఆంధ్ర విశ్వవిద్యాలయం.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చొరవతో కొత్త ఊపిరులందుకుంది. తమ ప్రైవేటు వర్సిటీ ఎదుగుదల కోసం ఏయూ ఓ దెయ్యాల కొంప అంటూ టీడీపీ నేతలు యూనివర్సిటీ ప్రతిష్టను దిగజార్చే వాఖ్యలు చేస్తే.. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతతో నాలుగేళ్ల కాలంలో సమాజ ఉపయుక్తంగా, పరిశ్రమల అవసరాలు తీర్చే వైవిధ్య పరిశోధన కేంద్రంగా ఆంధ్రా యూనివర్సిటీ తీర్చిదిద్దారు. విద్యార్థి అభ్యున్నతికి మార్గదర్శిగా పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా ఏయూని ప్రభుత్వం మార్చింది. వివిధ దేశాలు, యూనివర్సిటీలు, సంస్థల ఒప్పందాలతో చదువుకు సహకారం అందిస్తూ ప్రతి విద్యార్థిని ప్రోత్సహించాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్న ఏయూకి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వైస్‌చాన్స్‌లర్ ప్రొ.పీవీజీడీ ప్రసాదరెడ్డి నవ్య ఆలోచనలతో పనిచేస్తూ నూతన ప్రాజెక్టులను నిర్వహిస్తూ విశ్వవిద్యాలయ ప్రగతికి బాటలు వేశారు.

నలు దిశలా ప్రగతి

విద్యార్థులను ఆవిష్కర్తలుగా, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏయూ–నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను రూ.27 కోట్లతో ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో గతంలో లేని విధంగా సొంతంగా ఒక స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్ ఆ-హబ్‌ను తీర్చిదిద్దారు. టీ-హబ్‌కు దీటుగా.. ఆ-హబ్‌లో ప్రస్తుతం 150కి పైగా స్టార్టప్ సంస్థలు ఇక్కడి నుంచి సేవలు అందిస్తున్నాయి. వేలాది మంది యువతకు ఉపాధిని అందిస్తున్నాయి. ఫార్మా రంగంలో స్టార్టప్, ఇంక్యుబేషన్ కేంద్రంగా ఎలిమెంట్ తీర్చిదిద్దారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ (ఏయూ సిబ్),



ఎలిమెంట్ బిల్డింగ్

విశిష్ట గుర్తింపు

ఆంధ్రవిశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో నాక్ డబుల్ ప్లస్ గ్రేడ్‌ను, 3.74 సీజీపీఏ సాధించి సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఈ గుర్తింపు 2030 వరకు ఉంటుంది. ఆచార్యుల కొరత ఉన్న సమయంలో కూడా ఏయూ ఇంతటి విశిష్ట ర్యాంక్‌ను సాధించడం జాతీయ స్థాయిలో తొలి మూడు విశ్వవిద్యాలయాలలో ఒకటిగా ఏయూ నిలిచింది.

అవంతి ఫీడ్స్ సంస్థ సహకారంతో ఏర్పాటైన ఏయూ–అవంతి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మెరైన్ సంబంధిత రంగాలలో విశిష్ట పరిశోధనలు జరుపుతూ విజయవంతంగా పనిచేస్తోంది. ఆర్‌ఐఎన్‌ఎల్ సహకారంతో హ్యూమన్ జెనిటిక్స్ విభాగంలో బయోఆర్బర్ ఇంక్యుబేషన్ కేంద్రాన్ని, ఏయూ పూర్వ విద్యార్థి రవికిరణ్ స్థాపించిన టీకాబ్స్–ఇ జీవశాస్త్ర సంబంధ పరిశోధనలు, ఆవిష్కరణలు చేస్తూ విద్యార్థులు పేటెంట్లు సాధించే దిశగా పనిచేస్తోంది. అంతర్జాతీయంగా జియో ఇంజినీరింగ్ ప్రాధాన్యతను ముందుగానే గుర్తించి జియో ఇంజినీరింగ్ విభాగాన్ని పటిష్టపరిచారు. రూ.67.5 కోట్లతో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) సంయుక్తంగా ఏయూతో ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. ఫుడ్ టెస్టింగ్, ఇంక్యుబేషన్ కేంద్రం ఏయూలో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఏపీ ఫుడ్‌సొసైటీ రూ.5 కోట్లు మంజూరు చేసింది. ఏయూలో సేవలందిస్తున్న డిజిఫాక్ సంస్థకు వేలాది మంది యువతకు లో కోడ్ టెక్నాలజీపై ప్రత్యక్షంగా శిక్షణ అందిస్తూ ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది.

98 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా..

మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినులకు నూతన హాస్టల్ నిర్మాణం, ప్రయోగశాలలు, మౌలిక వసతుల్ని కల్పించారు. 98 ఏళ్ల వర్సిటీ చరిత్రలో ఫార్మసీ కళాశాల విద్యార్థినులకు తొలిసారిగా ప్రత్యేక హాస్టల్ భవనాన్ని కళాశాలకు చేరువలో నిర్మించారు. వర్సిటీ విద్యార్థులకు వసతి కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ నూతనంగా ఆరెంజ్, మెటా–హెచ్ హాస్టళ్లను నూతనంగా నిర్మించడంతో పాటు, విద్య ప్రగతి విహార్, విద్య తరంగిణి విహార్ హాస్టల్‌ను ఆధునీకీకరించి అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటితో పాటు శాతవాహన హాస్టల్‌లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించారు. ప్రతీ విభాగంలో టాయిలెట్స్, విద్యార్థినుల రెస్ట్‌రూమ్‌లను పూర్తిగా మార్పు చేశారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఓపెన్ ఎయిర్ థియేటర్‌కు పూర్వవైభవం తీసుకువచ్చారు.

ఆక్రమణదారుల చెర నుంచి..

నగరం నడిబొడ్డున ఉన్న ఏయూకి చెందిన విలువైన ఆస్తులను టీడీపీ నేతలు తమ కబంధ హస్తాల్లోకి తీసుకున్నారు. యూనివర్సిటీ చుట్టూ ఉన్న భూములను దశాబ్దాలుగా ఆక్రమించి వ్యాపార సముదాయాలు నిర్మించారు. యూనివర్సిటీ గ్రౌండ్, దాని పరిసరాలన్నీ పాదలతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయాయి. ఆక్రమణల పర్వంపై వీసీ ప్రసాదరెడ్డి ఉక్కుపాదం మోపారు. దాదాపు రూ.400 కోట్ల విలువైన స్థలాలను ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుని ఆ స్థలాలను విద్యార్థులకు ఉపయుక్తంగా మలిచారు.

డ్రోన్ టెక్నాలజీకి చిరునామాగా..

ఏయూలో ప్రత్యేకంగా డ్రోన్ టెక్నాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వీరికి ఉపయుక్తంగా ఏయూలో మూడు హెలీప్యాడ్లను అందుబాటులో ఉంచారు. డ్రోన్ టెక్‌లో విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందిస్తున్నారు. కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల అవసరాలు అనుగుణంగా నూతనంగా అల్గారిథం భవనాన్ని నిర్మించారు. దీనిలో ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణకు ఒక అంతస్తును కేటాయించారు. విశాలమైన తరగతి గదులు, సమావేశ మందిరాలు నిర్మించారు. నాలుగేళ్ల కాలంలో ఏయూలో విదేశీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగి నేడు 55 దేశాలకు చెందిన వెయ్యి మందికిపైగా విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తుండటం విశేషం.

నాలుగేళ్లలో ఏయూ రూపురేఖలు మారిపోయాయి



నాలుగేళ్లలో యూనివర్సిటీ రూపురేఖలు మారిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో క్యాంపస్‌లో మునుపెన్నడూ లేని స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించారు. కొత్త భవనాలు నిర్మించారు. పాత వాటిని పునరుద్ధరించారు. మంచి పరిపాలన, కొత్త కోర్సుల రూపకల్పన, విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్‌పై ప్రధానంగా దృష్టి సారించారు. ఇప్పటి వరకు ఎవరూ చేయలేని విధంగా ప్రస్తుత వీసీ ప్రసాదరెడ్డి అన్యాక్రాంతమైన రూ.వందల కోట్లు విలువ చేసే ఏయూ భూములు తిరిగి యూనివర్సిటీకి దక్కేలా చేశారు. ప్రధానంగా నాక్‌లో టాప్ ర్యాంక్ రావడం ప్రతి ఒక్కరూ గర్వించాల్సిన విషయం. ఏయూ సాధించిన ప్రగతికి అదే కొలమానం. అందుకే ఆయనకు రెండోసారి వీసీగా అవకాశం దక్కింది. – ప్రొ.వి.బాలమోహన్‌దాస్, నాగార్జున వర్సిటీ మాజీ వీసీ

వర్సిటీని మరింత బలోపేతం చేస్తా



నేను బాధ్యతలు తీసుకునే సమయంలో యూనివర్సిటీ హెరిటేజ్ స్ట్రక్చర్స్ పూర్తిగా శిథిలమైపోయాయి. వాటిపై దృష్టిసారించి.. ప్రభుత్వ సహకారంతో ఏయూని అభివృద్ధి చేశా. కోవిడ్ వంటి విపత్కర సమయాల్లో సైతం సకాలంలో పరీక్షలు పూర్తిచేసి, ఫలితాలను సకాలంలో అందించాం. ప్రత్యేకంగా ప్లేస్‌మెంట్ అధికారులను నియమించి ఆర్ట్స్, సైన్స్,న్యాయ కోర్సుల విద్యార్థులకు సైతం మెరుగైన ఉపాధి అవకాశాల్ని కల్పించాం. ఈ ఏడాది అత్యధికంగా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని రూ. 84.5 లక్షల వేతనంతో ఉద్యోగం సాధించి రికార్డు సృష్టించింది. త్వరలోనే ఏయూ శతాబ్ది ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం. 20 ఏళ్లగా రిక్రూట్‌మెంట్ జరగలేదు. దానిపై ప్రభుత్వం దృష్టి సారించడం శుభపరిణామం. – ప్రొ.పీవీజీడీ ప్రసాదరెడ్డి, వీసీ

న్యూస్‌రీల్

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 5 దరఖాస్తులు

తుమ్మపాల: ఉద్యోగుల వ్యక్తిగత సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారమయ్యేలా చూస్తానని కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 5 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. నెలలో ప్రతి మూడో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

ప్రాథమిక దశలో మెరుగైన వైద్యం

- కె.కోటపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో హేమంత్‌కుమార్



ఆరోగ్యశ్రీ కార్డులను అందిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్‌కుమార్

కె.కోటపాడు: రోగులకు ప్రాథమిక దశలోనే మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని డీఎంహెచ్‌వో ఎ.హేమంత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కె.కోటపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులతో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రిస్క్రిప్షన్ మందులు అందుబాటులో లేకపోతే, రోగులకు పోస్ట్ ద్వారా ప్రభుత్వమే వ్యాధి నయమైనంత వరకు ఇస్తుందన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో వ్యాధిగ్రస్తులకు శస్త్ర చికిత్సలు చేయించి పూర్తిగా కోలుకున్నంత వరకు ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పర్యవేక్షిస్తారన్నారు. రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు ఆరోగ్యశ్రీ పరిమితి పెంచినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. లబ్ధిదారుల మొబైల్‌లో ఆరోగ్యశ్రీ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసే బాధ్యత వలంటీర్లు, వైద్య సిబ్బందిపై ఉందని తెలిపారు. 127 మందికి వైద్య సేవలందించినట్లు వైద్యాధికారి నిర్మల తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ప్రోగ్రాం అధికారి కిశోర్‌కుమార్, ఎంపీడీవో ప్రసాద్, వైద్యాధికారి సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఏఎన్‌ఎం నళిని పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొన్న టిప్పర్

- బాబాయ్‌తో సహ చిన్నారి దుర్మరణం

బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

- చెట్టును ఢీకొన్న బైక్
- భార్య మృతి, భర్తకు తీవ్రగాయాలు

8లో

కులగణన ప్రారంభం

- ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ

సాక్షి, అనకాపల్లి: జిల్లా అంతటా కులగణన ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. ఈ నెల 28 వరకు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారు. కులాల వారీ జనాభా, వారి ప్రస్తుత సామాజిక, విద్య, ఆర్థిక పురోభివృద్ధి తెలుసుకోవడానికి కులగణన నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన విషయం తెలిసిందే. తొలిరోజు అనకాపల్లి, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్లలో అన్ని మండలాల పరిధిలో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో ప్రత్యేక మొబైల్ యాప్ సహాయంతో ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. ఈ సర్వేపై వివిధ వర్గాల ప్రజలు, ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకోవడానికి జిల్లా స్థాయి సదస్సులను ఇప్పటికే నిర్వహించారు. జోనల్, మండల, సచివాలయ స్థాయి సిబ్బందికి ఈ సర్వేపై సమగ్ర శిక్షణ కూడా అందించారు. సర్వే చేస్తున్న సిబ్బందికి ప్రజలు సహకరించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి కోరారు. ఈ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత విభాగాల అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

జిల్లాలో తొలి రోజు వివరాలు ఇలా..

అనకాపల్లి (జీవీఎంసీ), నర్సీపట్నం అర్బన్, యలమంచిలి అర్బన్‌తో పాటు 24 మండలాల పరిధిలో తొలిరోజు కులగణన జరిగింది. జిల్లాలోని 485 సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. తొలిరోజు 2,484 క్లస్టర్ల పరిధిలో 8,940 ఇళ్లలోని 16,399 మంది సర్వే పూర్తయింది.



మాడుగుల మండలం కె.జె.పురంలో కులగణన సర్వే చేస్తున్న వీఆర్వో పెదబాబు, వలంటీర్

కులగణన షెడ్యూల్ ఇదే..

- జనవరి 19- 28 వరకు ఇంటింటి సర్వే
- జనవరి 29- ఫిబ్రవరి 2 వరకు మిగిలిన ఇళ్లు, వ్యక్తుల వివరాల సేకరణ
- ఫిబ్రవరి 15 వరకు సచివాలయ స్థాయిలో డేటా క్రోడీకరణ, ఇతర ప్రక్రియలు

రైతులకు అధికంగా రుణాల మంజూరు



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ చిక్కాల రామారావు

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల రైతులకు మరింత ఎక్కువ రుణాలు మంజూరు చేయించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావుతో కలిసి కలెక్టరు వ్యవసాయ శాఖ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించే రుణ సదుపాయాలను గురించి రైతులకు పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. రైతుల అర్హతలు బట్టి అవసరమైన వారందరికీ వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య, ఉద్యానవన శాఖలకు సంబంధించి రుణాలను సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీలైనంత ఎక్కువ మందికి రుణాలు మంజూరయ్యేలా బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఎటువంటి సమస్యలకు తావు లేకుండా పారదర్శకంగా ధాన్యం సేకరించాలన్నారు. పాడి పశువుల కొనుగోలుకు సంబంధించిన రుణాల విషయంలో పీఎంఈజీపీ సంస్థలైన కేవీఐసీ, డీఐసీ అధికారుల సమన్వయంతో రుణ దరఖాస్తులను ఎక్కువ శాతం మంజూరు చేయించాలన్నారు. పంటల దిగుబడి శాతం పెంచేందుకు, మార్కెటింగ్ చేసేందుకు రైతులకు వ్యాపార సంస్థలకు మేలు చేసే విధంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు. చిక్కాల రామారావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు, వివిధ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు అధికారులు దిశానిర్దేశం చేయాలన్నారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఎస్.రమణ, ఎ.సూరిఅప్పారావు, వ్యవసాయ శాఖ జేడీ మోహనరావు, సహకార బ్యాంకు మేనేజర్ వర్మ, పశుసంవర్థక శాఖ జేడీ ప్రసాదరావు, మత్స్య శాఖ డీడీ ప్రసాద్, ఉద్యానవన శాఖ డీడీ ప్రభాకర్‌రావు, ఏపీఎంఐపీ ఏడీ జీవీ లక్ష్మి, డీఎస్‌వో కేవీఎల్‌ఎన్ మూర్తి, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా మిలాన్

విశాఖ సిటీ: విశాఖ వేదికగా ఫిబ్రవరి 19 నుంచి బీచ్ రోడ్డులో జరగనున్న మిలాన్–2024 వేడుకలకు చేయాల్సిన ఏర్పాట్ల కోసం నేవీ, పోలీస్, వివిధ విభాగాల అధికారులు శుక్రవారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. పరేడ్ జరిగే బీచ్ రోడ్డులో పలు ప్రాంతాలను సందర్శించి చేపట్టాల్సిన పనులను గుర్తించారు. మెయిన్ రోడ్డు వైపు, బీచ్ వైపు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. సామాన్య పౌరులు రాక, పార్కింగ్ సదుపాయం, డబుల్ బారికేడింగ్, మెస్ బారికేడింగ్, ఎల్‌ఈడీ స్క్రీన్లు, సీసీటీవీ కెమెరాల ఏర్పాట్లపై సమీక్షించారు. డీసీపీలు శ్రీనివాసరావు, ఆనందరెడ్డి, తూర్పు నావికాదళ ప్రధాన కేంద్ర డిప్యూటీ నేవల్ ప్రొవోస్ట్ మార్షల్, కమాండర్ ఉదయ్ అగర్వాల్, ఐఎన్‌ఎస్ కళింగ ఎగ్జిక్యూటివ్ అధికారి కెప్టెన్ దివాకర్ శంకర్, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకుడు వి.మణిరామ్, ఇతర శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాల్సిన ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాసరావు, తూర్పు నావికాదళ డిప్యూటీ ప్రొవోస్ట్ మార్షల్ ఉదయ్ అగర్వాల్ ఇతర అధికారులకు ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఎన్‌సీబీ (నేవల్ కోస్టల్ బ్యాటరీ) నుంచి ఆర్‌కే బీచ్ వరకు, అలాగే వుడా పార్క్ జంక్షన్ నుంచి ఆర్‌కే బీచ్ వరకు రోడ్డుకు ఇరువైపులా డబుల్ బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని నేవీ అధికారులకు సూచించారు. సామాన్య పౌరులు వేచి ఉండేందుకు అనువుగా బాక్సులు ఏర్పాటు చేయాలని, అక్కడ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఉంచాలన్నారు. వాహనాల పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించారు.

తీర్థ యాత్రలకు వెళ్లి తిరిగిరాని లోకాలకు..

- అనకాపల్లి సమీపంలో శంకరం వద్ద రోడ్డు ప్రమాదం
- ఒకే కుటుంబంలో ముగ్గురు దుర్మరణం
- మృతులు కాకినాడ జిల్లావాసులు
- మరో ఐదుగురికి స్వల్ప గాయాలు

ఏటా మాదిరిగానే తీర్థ యాత్రలకు వెళ్లి ఉత్సాహంగా తిరిగి వస్తున్న ఆ కుటుంబాన్ని పెను విషాదం కమ్మేసింది. రోడ్డు ప్రమాదం వారి ఆనందాన్ని ఆవిరి చేసింది. కారు టైరు పేలిన దుర్ఘటనలో కుటుంబంలోని ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంతో బంధువులు, సహ కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.



ఘటనా స్థలం నుంచి దేవీ కుసుమను ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబసభ్యులు



భార్య సత్యవతి మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త సత్యనారాయణ



మృతి చెందిన పోలిరెడ్డి సత్యవతి, సూర్యకుమారి, అభిరామ్ (ఫైల్)

అనకాపల్లి/బిక్కవోలు (తూర్పుగోదావరి జిల్లా): అరసవిల్లి, శ్రీకూర్మం, సింహాచలంలో దైవదర్శనాలు చేసుకున్నారు.. అందరూ ఆనందంగా తిరుగుపయనమయ్యారు.. ఇంతలో పెద్ద శబ్దం.. అది వచ్చింది తమ కారు నుంచేనని తెలుసుకునేలోపే ఘోర ప్రమాదం.. కారు టైరు పంక్చర్ కావడంతో పల్టీలు కొట్టి, అందులో ప్రయాణిస్తున్న తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు గ్రామానికి చెందిన పోలిరెడ్డి సత్యవతి (49), పోలిరెడ్డి సూర్యకుమారి (38), పోలిరెడ్డి అభిరామ్ (4) అక్కడికక్కడే చెందారు. అనకాపల్లి సమీపంలోని శంకరం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఈ దుర్ఘటన జరిగింది. బిక్కవోలుకు చెందిన పోలిరెడ్డి సత్యనారాయణ, అతని సోదరుడు తమ కుటుంబ సభ్యులతో ప్రతి ఏటా తీర్థయాత్రలకు వెళుతుంటారు. అలాగే ఈసారి కూడా శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకూర్మం, అరసవిల్లి, విశాఖ జిల్లాలోని సింహాచలం దేవాలయాలను దర్శించుకునేందుకు 11 మంది రెండు కార్లలో వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. పోలిరెడ్డి సత్యనారాయణ, అతని భార్య సత్యవతి, సత్యనారాయణ తమ్ముడి భార్య సూర్యకుమారి, సత్యనారాయణ కుమారుడు పోతురాజు(రాజా), మనవడు అభిరామ్, ఇంకా వెంకటరమణ, అశోక్, దేవీకుసుమలు ఒక కారులో వస్తున్నారు. మిగిలిన కుటుంబ సభ్యులు రెండో కారు లో వస్తున్నారు. అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం సమీపంలో కారు టైరు పేలిపోవడంతో పక్కనే ఉన్న డివైడర్‌ను గుద్ది, పల్టీలు కొట్టడంతో కారు వెనుక సీటులో ఉన్న ముగ్గురు మృతి చెందారు. ముందు సీటులో కూర్చున్న వారికి స్వల్పగాయాలయ్యాయి. క్షణాల్లో రహదారి అంతా రక్తసిక్తంగా మారింది. కారు పల్టీకొట్టి రోడ్డుకు అడ్డంగా పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఒకపక్క మృతదేహాలు.. మరోపక్క గాయపడ్డవారి రోదనలు.. అటుగా రాకపోకలు సాగించే వారిని కంటతడి పెట్టించాయి. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ వి.సుబ్బరాజు, సీఐలు జి.శంకరరావు, టి.శ్రీను ఘటనాస్థలికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన కారును తొలగించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. క్షతగాత్రులకు ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రాథమిక చికిత్స చేసి, పంపించివేశారు.

క్లుప్తంగా

గొల్లబంద దిబ్బ ఆక్రమణకు టీడీపీ నేత యత్నం

- తహసీల్దార్‌కు గ్రామస్తుల ఫిర్యాదు



గొల్లబందదిబ్బను కాపాడాలని ఎమ్మార్వోకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు



గొల్లబంద దిబ్బ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

తుమ్మపాల: మండలంలోని మాకవరం రెవెన్యూ పరిధిలో ఉన్న గొల్లబంద దిబ్బను ఆక్రమించేందుకు టీడీపీ నేత, మాజీ జెడ్పీటీసీ పొల్నాటి అప్పారావు యత్నిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కోరుతూ మార్టూరు గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ పి.వి.ఎల్.ఎన్. గంగాధరరావుకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్177–10లోని 3 ఎకరాల్లో గొల్లబంద దిబ్బ ఉందని, మండలంలో మాకవరం, మార్టూరు గ్రామాల సరిహద్దులో ఉన్న దీనిని ఆక్రమించేందుకు అప్పారావు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. అంతకు ముందు ఆ భూమిని సర్వే నిర్వహిస్తున్న విషయం తెలుసుకుని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో టీడీపీ నేత అప్పారావు అక్కడ నుంచి జారుకున్నారు. అనంతరం గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కరణం చిలుకు, కరణం శ్రీనివాసరావు, కరణం వెంకటశేషు, గణపతిరావు, రైతులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన అమ్మవారి సంబరం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు,వైఎస్సార్‌సీపీ నేతలు



కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు తరలివస్తున్న జనం

- ఘనంగా కనక మహాలక్ష్మి అమ్మవారి నెలరోజుల పండగ
- లక్షమందికిపైగా తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిపోయిన పట్టణ రహదారులు
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



జాతరలో చిన్నారుల నృత్య ప్రదర్శన



జాతరలో ఏర్పాటు చేసిన జెయింట్ వీల్

యలమంచిలి రూరల్: కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుత్‌కాంతులు.. బాణసంచా పేలుళ్ల..ఎంత సేపు చూసినా తనివితీరని సాంస్కృతిక ప్రదర్శనలు ఒకవైపు.. అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరిన భక్తజనం మరో వైపు..వెరసి పట్టణంలోని ధర్మవరంలో కనక మహాలక్ష్మి అమ్మవారి నెల రోజుల మహోత్సవం అంబరాన్ని తాకింది. లక్షమందికిపైగా భక్తులు రావడంతో పట్టణంలోని పలు రహదారులు కిటకిటలాడాయి. పట్టణంలోని ధర్మవరంలో మార్గశిర మాసం నెల రోజుల పాటు కనక మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేశారు. మార్గశిరమాసం పూర్తయిన తదుపరి సంక్రాంతి తరువాత అమ్మవారి నెల రోజుల పండగ నిర్వహించడం ఆనవాయితీ. శుక్రవారం అమ్మవారి నెల రోజుల పండగను ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ,గ్రామ పెద్దల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుంచి ఇసుకవేస్తే రాలనంతగా జనం తరలి వచ్చారు. పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారిని దర్శించుకుని పసుపు,కుంకుమలు సమర్పించారు. యలమంచిలి ప్రధాన రహదారి నుంచి ధర్మవరం వరకూ రహదారికి ఇరువైపులా పలు స్టాళ్లు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.జబర్దస్త్ అప్పారావు స్కిట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రత్యేక స్టేజీలపై పలుగ్రామాల నుంచి వచ్చిన కోలాట బృందాలు ప్రదర్శనలు నిర్వహించాయి.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తిరాజు (కన్నబాబు రాజు), మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, ఎంపీపీ బోదెపు గోవింద్,వైస్ చైర్మన్‌లు అర్రెపు గుప్త,బెజవాడ నాగేశ్వరరావు మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర,రాజాన సూర్య నాగేశ్వరరావు, పలు పార్టీల నేతలు సుందరపు విజయ్‌కుమార్, నాగేశ్వరరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.జాతరకు వచ్చిన ప్రముఖులకు ఆలయ కమిటీ ప్రతినిధులు కొటారు సాంబ,మడుగుల సత్యనారాయణ,కొటారు సూర్య ప్రకాష్ తదితరులు తీర్థప్రసాదాలు అందజేశారు.

భారీ పోలీసు బందోబస్తు

ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా యలమంచిలి సీఐ షేక్ గఫూర్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఎనిమిది మంది ఎస్‌ఐలు, 80 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. పరవాడ డీఎస్పీ సత్యనారాయణ పర్యవేక్షించారు. పట్టణంలోకి రాకపోకలు సాగించే బస్సులు,ఇతర వాహనాలను దారి మళ్లించారు. జాతరకొచ్చే వారి వాహనాలను నిలిపి ఉంచేందుకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను కేటాయించారు.

20 వేల మందికి అన్నసమారాధన



భక్తులకు ఆహారపదార్థాలు వడ్డిస్తున్న నిర్వాహకులు

యలమంచిలి రూరల్: వారంతా సాధారణ మధ్యతరగతి వర్గానికి చెందిన వారు. ఐదేళ్లుగా కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకొచ్చే భక్తుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా అన్నసమారాధన చేస్తూ అందర్నీ ఔరా అనిపిస్తున్నారు. ప్రతి ఏటా అమ్మవారి జాతరలో 20 వేల మందికి పైగా భక్తులకు అన్నసమారాధన చేస్తూ భక్తుల సంతృప్తే తమకు అమితానందంగా భావిస్తున్నారు. యలమంచిలి ధర్మవరానికి చెందిన కొఠారు నానాజీ, వెంకట రమేష్, పందిరి సంతోష్ కుమార్‌లు. శుక్రవారం అమ్మవారి ఆలయం పక్కనున్న ఇండోర్ స్టేడియం ఆవరణలో ప్రత్యేక అన్నసమారాధన శిబిరం ఏర్పాటు చేశారు.అక్కడే వేడివేడిగా ఆహార పదార్థాలు తయారు చేసి మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు వచ్చిన భక్తులకు లేదనకుండా రుచికరమైన భోజనాన్ని అందించి అందరి మన్ననలు అందుకున్నారు. ఈ సారి కూడా 20 వేల మందికి పైగా భోజనం చేశారని, అన్ని దానాలకంటే అన్నదానం మహాదానంగా భావిస్తూ పైసా ఆశించకుండా ఇతరుల ఆకలి తీర్చడంలో ఉన్న సంతృప్తి అంతా ఇంతా కాదని నిర్వాహకులు పేర్కొన్నారు.

సీఎం చిత్రపటానికి చెరకు రైతుల క్షీరాభిషేకం



గోవాడ సుగర్ ఫ్యాక్టరీ చెరకు యార్డులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

- రూ.9.3 కోట్ల పాత బకాయిల చెల్లింపుపై సర్వత్రా ఆనందం

చోడవరం: బకాయిలు చెల్లించడంతో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికులు ఎంతో ఆనందంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ క్షీరాభిషేకం చేశారు. ఫ్యాక్టరీ గేటు వద్ద, అన్ని చెరకు కాటాల వద్ద శుక్రవారం సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటాన్ని పాలతో అభిషేకించారు. పాత చెరకు బకాయిలు చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూ.12 కోట్ల 30 లక్షలు గ్రాంటుగా మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో రైతులకు చెల్లించాల్సిన రూ. 9 కోట్ల 80 లక్షలను రైతుల ఖాతాల్లోకి ఫ్యాక్టరీ జమ చేయడంతో రైతుల్లో ఆనందం వెల్లువెత్తింది. ఫ్యాక్టరీ గేటు వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి.. 'రైతు బాంధవులు జగన్‌మోహన్‌రెడ్డి జిందాబాద్'అంటూ రైతులంతా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీటీసీ శరగడం నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు పాల్గొన్నారు. పీఎస్ పేట చెరకు కాటా వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు దన్నిన వెంకట్రావు, ఎంపీటీసీ పుట్రేవు శ్యామ్‌ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు చవితిన బాబూరావు, రైతులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీలు



మంగళాపురంలో విధుల్లో చేరిన అంగన్‌వాడీ టీచర్, ఆయా



అంగన్‌వాడీ సిబ్బంది వండి పెట్టిన పౌష్టికాహారం తింటున్న పిల్లలు

బుచ్చెయ్యపేట: అంగన్‌వాడీ టీచర్లు సమ్మె విరమించి విధుల్లో చేరారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 12వ తేదీ నుంచి వీరు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. జూన్ నుంచి వేతనాలు పెంచేందుకు, ఇతర సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం హామీ ఇవ్వడంతో సమ్మె విరమించి విధుల్లో చేరారు. మంగళాపురం, విజయరామరాజుపేట -1, విజయరామరాజుపేట-2 గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, లోపూడి, కుముదాంపేట గ్రామాల్లో ఆయాలు శుక్రవారం విధుల్లోకి చేరారు. విధుల్లో చేరినట్టు కొందరు ఫోన్, వాట్సాప్ ద్వారా, మరికొందరు నేరుగా ఐసీడీఎస్ పీవో ఉషారాణిని కలిసి తెలిపారు.

ఐసీడీఎస్ పరిధిలో 284 అంగన్‌వాడీ కేంద్రాలుండగా శుక్రవారం 74 కేంద్రాలు తెరుచుకున్నట్టు ఐసీడీఎస్ పీవో తెలిపారు. 144 మంది అంగన్‌వాడీ టీచర్లు,ఆయాలు విధుల్లో చేరినట్టు ఆమె చెప్పారు.

లింగ వివక్ష, లైంగిక వేధింపుల నివారణపై నేడు సదస్సు

విశాఖ–లీగల్: పని చేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు, లింగ వివక్షత నివారణ, రక్షణ చర్యలు, సునిశిత అంశాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఆలపాటి గిరిధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు నూతన సముదాయాల భవనంలోని సమావేశ మందిరంలో మధ్యాహ్నం 12 గంటలకు ఈ సదస్సు జరుగుతుందన్నారు.

బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

- చెట్టును ఢీకొన్న బైక్
- భార్య మృతి, భర్తకు తీవ్రగాయాలు
- రామన్నపాలెం వద్ద ప్రమాదం



ప్రమాదానికి గురైన బైక్ (ఇన్‌సెట్) మృతి చెందిన భువనేశ్వరి(ఫైల్)

మాకవరపాలెం: మండలంలోని రామన్నపాలెం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. యలమంచిలిలో తమ బంధువు మృతిచెందడంతో అంత్యక్రియలకు మండలంలోని జి.కోడూరు గ్రామానికి చెందిన ఆడారి నాగేశ్వరరావు(50), ఆయన భార్య భువనేశ్వరి(43) శుక్రవారం బైక్ పై వెళ్లారు. అక్కడ కార్యక్రమాలు పూర్తయిన తరువాత తిరిగి స్వగ్రామం వస్తుండగా రామన్నపాలెం జంక్షన్ సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో భార్యాభర్తలిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆటోలో మాకవరపాలెం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. భువనేశ్వరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా కొండలఅగ్రహారం వద్దకు వెళ్లేసరికి ఆమె మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం జరిగింది. మృతురాలి కుమారుడు అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తీవ్ర విషాదం

- స్కూటీని ఢీకొన్న టిప్పర్
- బాబాయ్ సహా చిన్నారి దుర్మరణం
- దువ్వాడ రైల్వే స్టేషన్ సమీపంలో ఘటన



ఘటనాస్థలంలో మృతి చెందిన బాబాయ్ వెంకటప్రసాద్, పాప అంశిని



ప్రసాద్(ఫైల్)



అంశిని(ఫైల్)

కూర్మన్నపాలెం : తాతగారి ఇంట్లో సంక్రాంతి సంబరాలు చేసుకుని బాబాయ్‌తో తిరిగి వెళ్తున్న ఓ చిన్నారిని మృత్యువు టిప్పర్ రూపంలో కబళించింది. స్కూటీ, టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు, చిన్నారి(బాబాయ్, కూతురు) మృతి చెందారు. ఇప్పటికే ఇంటి పెద్దను కోల్పోయిన ఆ కుటుంబం ఇప్పుడు మరో ఇద్దర్ని పోగొట్టుకుని తీవ్ర విషాదంలో మునిగిపోయింది. దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చోడవరం మండలం కలిగొట్ల గ్రామానికి చెందిన కొల్లి పద్మ తన కూతురు అంశిని(8)తో కలిసి సంక్రాంతికి గాజువాక దరి చిట్టినాయుడు కాలనీలోని అత్తగారి ఇంటికి వచ్చింది. పండగ ముగిసిన తరువాత కూతురిని తాతగారి వద్ద వదిలి ఆమె వెళ్లిపోయింది. శుక్రవారం కొల్లి వెంకటప్రసాద్(31) తన అన్న కూతురైన అంశినిని తీసుకుని చోడవరంలో వదిలి పెట్టేందుకు స్కూటీపై బయలుదేరాడు. ఈ క్రమంలో దువ్వాడ రైల్వే స్టేషన్ సమీపంలోని నాగదేవత గుడి వద్దకు వచ్చేసరికి టిప్పర్ బలంగా ఢీకొట్టడంతో వెంకటప్రసాద్, అంశిని అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న దువ్వాడ ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడు వెంకటప్రసాద్ తండ్రి పైడిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అంశిని తండ్రి గతంలో చనిపోవడంతో తల్లి పద్మతో ఉంటుంది. వెంకటప్రసాద్ పరవాడలోని గ్లాండ్ ఫార్మా కంపెనీలో పని చేస్తున్నాడు.

నాడు-నేడు పనులకు అడ్డంకులు

- రేవుపోలవరంలో పనులు అడ్డుకుంటున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు
- ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని గ్రామస్తుల ఆవేదన



అసంపూర్తిగా నిలిచిపోయిన రేవుపోలవరం పాఠశాలలో పనులు



నాడు నేడు పనులపై ఆరా తీస్తున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి (ఫైల్)

ఎస్.రాయవరం : మండలంలోని రేవుపోలవరం ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పనులకు ఆక్రమణదారులు అడ్డంకులు సృష్టిస్తున్నారు. దీంతో ఆ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పోలీసులకు తెలియజేసినా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో అదనపు భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.97 కోట్లు మంజూరు చేసింది. గత ఏడాది ఆగస్టులో భవనాల నిర్మాణం కోసం పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షలకు పైగా వెచ్చించి పునాదులు నిర్మించి, బోరు ఏర్పాటు చేశారు. ఈ సమయంలో భవనం నిర్మిస్తున్న ప్రాంతం తమ ఆధీనంలో ఉందని, ప్రభుత్వం తమకు నష్టపరిహారం ఇవ్వలేదని ఓ కుటుంబం అడ్డుకోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పనులకు అధికారులు క్లియరెన్స్ ఇచ్చినప్పటికీ ఆ కుటుంబ సభ్యులు పదే పదే ఆటంకం కలిగించారని ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమస్యను మండల అధికారులు.. జిల్లా అధికారులకు దృష్టికి తీసుకువెళ్లారు. రెండు నెలల కిందట జాయింట్ కలెక్టర్ జాహ్నవి వచ్చి స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణదారులు ఎవరని, ఎందుకు అడ్డుకుంటున్నారని ఆరా తీశారు. ఆక్రమణలో ఎవరూ లేరని తహసీల్దార్ విజయ్‌కుమార్ జేసీకి వివరించారు. దీంతో వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అంతకుముందు నర్సీపట్నం ఆర్డీవో, సర్వశిక్ష అభియాన్ ఈఈలు వచ్చి పరిశీలించి, పనులు జరిగేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంతమంది వచ్చి వెళ్లినా పనులు ముందుకు సాగడం లేదని, రక్షణ కల్పించడంలో స్థానిక పోలీసులు చొరవచూపడం లేదని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. కోట్లాది రూపాయలు ప్రభుత్వం కేటాయించినప్పటికీ తమ గ్రామంలో పాఠశాల భవనం నిర్మాణం చేయకపోవడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి, పాఠశాల భవనం నిర్మాణం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎస్పీ దృష్టికి తీసుకెళ్లాం, అయినా...



చినఉప్పలం రెవెన్యూ పరిధిలో రేవుపోలవరం ఉన్నత పాఠశాల భవనం నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాం. పెదఉప్పలంలో ఓ కుటుంబానికి చెందిన వ్యక్తులు భూమి తమదంటూ రెండు మూడు దఫాలు పనులను అడ్డుకున్నారు. వారిపై కేసునమోదు చేసి చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్ఐ ఆదేశించాను. అయినప్పటికీ స్థానిక పోలీసులు చర్యలు తీసుకోలేదు. ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోయింది. పోలీసులు తగిన రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

– కె.విజయ్‌కుమార్, తహసీల్దార్, ఎస్.రాయవరం మండలం

పనులను అడ్డుకోవడం దారుణం



పాఠశాల భవనాల నిర్మాణ పనులను అడ్డుకోవడం దారుణం. ఈ నిర్మాణాలు పూర్తయితే మా గ్రామంతో పాటు బంగారమ్మపాలెం, చినఉప్పలం, కాపుల వాతాడ, కొత్తరేవుపోలవరం గ్రామాలకు చెందిన సుమారు 5 వందల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. సమీపంలో జగనన్న కాలనీలో 350 పైగా ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. అక్కడ విద్యార్థులకు కూడా ఈ పాఠశాల ఉపయోగపడుతుంది. పనులు వెంటనే ప్రారంభించాలి.

– చోడిపల్లి అప్పన్న, తల్లిదండ్రులు కమిటీ చైర్మన్, రేవుపోలవరం

ఆటంకాలు సృష్టిస్తున్న వారిపై కేసులు

రేవుపోలవరంలో నాడు– నేడు పనులను ఓ కుటుంబానికి చెందిన వారు పలుమార్లు అడ్డుకున్న సంగతి వాస్తవమే. వారిపై రెండు కేసులు నమోదు చేశాం. కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టేటప్పుడు నాలుగు గంటల ముందుగా సమాచారం ఇస్తే బందోబస్తు ఇస్తాం.అధికారులనుంచి కూడా స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఎవరైనా పనులను అడ్డగిస్తే అరెస్టు చేస్తాం.

– ప్రసాద్‌రావు, ఎస్ఐ, ఎస్.రాయవరం

క్లుప్తంగా

మేజిస్ట్రేట్ శివకిరణ్‌కు వీడ్కోలు



న్యాయమూర్తి శివకిరణ్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి : బార్ అసోసియేషన్ ఆధ్వర్యం లో శుక్రవారం 13వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ శివకిరణ్‌కు వీడ్కోలు పలికారు. అదనపు జిల్లా జడ్జి ఎన్. శ్రీవిద్య, న్యాయమూర్తులు జి.గంగరాజు, పి.ప్రదీప, బీవీ విజయలక్ష్మి శివకిరణ్‌ను సన్మానించారు. ఈయన ఇక్కడి నుంచి కైకలూరు న్యాయస్థానానికి బదిలీపై వెళ్లారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయి లక్ష్మణ్, కార్యదర్శి కేపీఎస్ శ్రీనివాసరావు, న్యాయవాదులు సుధాకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాటు లెనిన్ వర్ధంతి కార్యక్రమాలు

అనకాపల్లి : శ్రామికవర్గ విప్లవ నేత లెనిన్ శత వర్ధంతి జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 నుంచి ఏడాది పొడవునా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కమ్యూనిస్ట్ అభిమానులు, ప్రగతిశీల వాదులు, ప్రజలు హాజరై లెనిన్‌కు ఘన నివాళి అర్పించాలన్నారు.

నిర్లక్ష్య వైఖరి విడనాడాలి

అనకాపల్లి : ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక నెహ్రూచౌక్‌లో శుక్రవారం ఉపాధ్యాయులు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రూ.96 కోట్ల 18 వేలు తక్షణమే చెల్లించాలని పేర్కొన్నారు. ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. డీఏ, పీఎఫ్ చెల్లించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శి శేషుకుమార్ పాల్గొన్నారు.

భూహక్కు చట్టం రద్దుకు డిమాండ్

అనకాపల్లి : ప్రజలకు హానికరమైన భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని పలువురు న్యాయవాదులు కోరారు. స్థానిక న్యాయ సముదాయం ముందు వారు చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 30వ రోజుకు చేరాయి. ప్రభుత్వం తమను చర్చలకు పిలవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖర మంత్రి సాయిలక్ష్మణ, కార్యదర్శి సూర శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 1,702 బెల్లం దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,200	4,200
మొదటి రకం	3,530	4,010
రెండో రకం	3,470	3,630
మూడోరకం	3,150	3,460

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం : రాజా
గుంటూరు కారం : సత్యనారాయణస్క్రీన్-1
హనుమాన్ : సత్యనారాయణస్క్రీన్-2
నా సామిరంగ : షిర్డిసాయి
సైంధవ్ : పర్తిసాయి
సలార్ (రెండుషోలు) : వెంకటేశ్వర
గుంటూరు కారం(రెండుషోలు)
నా సామిరంగ : శ్రీసత్య
హనుమాన్ : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 107 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. 'ఏ'పాజిటివ్-11 యూనిట్లు, 'బి'పాజిటివ్-24 యూనిట్లు, 'ఒ'పాజిటివ్-61 యూనిట్లు, 'ఎబి' పాజిటివ్-7 యూనిట్లు, 'ఒ'నెగెటివ్-3 యూనిట్లు, 'ఎబి'నెగెటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 271 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 497 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



చేతి కర్ర సాయంతో కశింకోటలోని జగనన్న సురక్ష శిబిరానికి వచ్చిన వృద్ధురాలు



కశింకోటలో రోగులను పరీక్షిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద



పరీక్షలు చేస్తున్న కీళ్ల వైద్య నిపుణుడు గోపి



డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూల్ శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్ట్ సంధ్య

'జగనన్న సురక్ష'.. ఆరోగ్యానికి భరోసా

- కశింకోటలో 317 మందికి వైద్య సేవలు
- రేబాక పంచాయతీలో 256 మందికి..



కశింకోట శిబిరానికి హాజరైన గర్భిణి



కశింకోట శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణురాలు విష్ణుప్రియ



కశింకోట వైద్య శిబిరంలో కళ్లజోళ్లు అందజేస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి



రేబాక శిబిరంలో కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



రేబాక శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తులు

కశింకోట : కశింకోటలో రెండో విడత నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి కూడా విశేష స్పందన లభించింది. సుమారు 317 మందికి వైద్య సేవలందించారు. వీరిలో 41 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి.. వారిలో 8 మందిని కంటి శస్త్ర చికిత్సలకు, 29 మందిని కళ్లద్దాలకు సిఫార్స్ చేశారు. గత శిబిరంలో పరీక్షలు నిర్వహించుకున్న వారిలో దాదాపు వంద మందికి కళ్లద్దాలు అందజేశారు. స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1వ సచివాలయానికి సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ప్రత్యేక వైద్యులు విష్ణుప్రియ, ఎస్.గోపి, స్థానిక పీహెచ్‌సీ వైద్యులు యశోద, తిరుపతిరావు పాల్గొని 276 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఆప్తాలమిస్ట్ సంధ్య కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు, కంటి శస్త్ర చికిత్సలకు సిఫార్స్ చేశారు. అలాగే 216 మందికి షుగర్ పరీక్షలు, 218 మందికి రక్త శాతం పరీక్షలు, ముగ్గురికి మలేరియా, మరో ముగ్గురికి డెంగ్యూ పరీక్షలు, నలుగురికి మూత్ర పరీక్షలు, ముగ్గురి నుంచి పరీక్షలకు కఫం సేకరణ, ఐదుగురికి ఈసీజీ పరీక్షలు నిర్వహించారు.

వంద మందికి కళ్లద్దాల పంపిణీ..

గత శిబిరంలో కంటి పరీక్షలు జరిపించుకున్న వారిలో సుమారు వంద మందికి సరఫరా చేసిన కళ్లద్దాలను ఎంపీపీ కలగా లక్ష్మి పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయ రజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజిమెన్, జిల్లా ఆరోగ్య శాఖ నోడల్ ఇన్‌చార్జి కె. జగదీష్, ఎంపీడీవో వి.వి. రవికుమార్, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేబాక పంచాయతీలో..

తుమ్మపాల: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రతి ఒక్కరికి రూ.25 లక్షల మేర వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించేలా సీఎం జగన్ నిధులు అందిస్తున్నారని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో రేబాక పంచాయతీ గురజాడనగర్ ఎంపీయూపీ పాఠశాలలో సర్పంచ్ మార్టూరు సన్యాసమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరాల ద్వారా రోగులకు చేస్తున్న వైద్య పరీక్షలు, మందుల పంపిణీని పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతోనే ప్రతి మారుమూల పల్లెకు విస్తతంగా వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడత కార్యక్రమాలు విజయవంతం అయ్యాయన్నారు. ఇప్పుడు రెండవ విడత కార్యక్రమాల్లో ప్రజలకి ఆరోగ్యపరంగా అన్ని సేవలు అందిస్తున్నామన్నారు. స్పెషలిస్ట్ వైద్య బృందంచే పరీక్షలు చేసి తగిన చికిత్స చేసేందుకు సిఫారసు చేస్తున్నారన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా ఎలాంటి కార్పొరేట్ ఆస్పత్రిలో అయినా చికిత్స చేయించుకునే సౌలభ్యం కల్పించారన్నారు. ప్రజలు మరే ప్రాంతానికి వెళ్లకుండా గ్రామాల్లోనే ఒకే చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, వైద్యులచే ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుని సేవలందిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో మొత్తం 256 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు వైద్యురాలు షమీమ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.నరసింహారావు, ఈవోపీఆర్డీ కె.ధర్మారావు, ఏసీడీపీఓవో టి. శశికళ, ఎంపీటీసీ మంత్రి సంతోషం, మార్టూరు భాస్కరరావు, వైద్యులు, సచివాలయ, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చక్కగా పరీక్షలు చేశారు..



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేయించుకున్నాను. వైద్యులు సుదీర్ఘంగా పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు, సిబ్బంది చక్కగా పరీక్షించారు. ఎంతో ఆనందంగా ఉంది.

– సయ్యద్ జాఫర్ అలీ, కశింకోట

సీఎంకు ధన్యవాదాలు..



దృష్టి సరిగ్గా లేకపోవడంతో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్నాను. శిబిరంలో ఉచితంగా మందులు అందజేశారు. అందరికీ ఉపయోగపడే కార్యక్రమం చేస్తున్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– మొల్లి అప్పల నరస, కశింకోట

పథకాల అమలు ఘనత సీఎం జగన్‌దే



రమేష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

అనకాపల్లి : ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలు ఏపీలో అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ అన్నారు. 83వ వార్డు 6వ సచివాలయం పరిధిలో శుక్రవారం అర్హులకు నూతన రేషన్ కార్డులు అందించారు. రాష్ట్రాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న సీఎంగా జగన్ చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా అనేక సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల చెంతకు చేరుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయనను సచివాలయ సిబ్బంది సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేశారు. అంతకు ముందు అక్కడే ఆధార్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి కారుకుండి కన్నబాబు, పార్టీశ్రేణులు బండి ఆనంద్, రెడ్డి చిన్న, కటారి నూకరాజు, నడిశెట్టి గోవింద్, నిమ్మకాయల మాధవ్, నిమ్మకాల సుధాకర్, మేడిశెట్టి గణేష్, సచివాలయ కన్వీనర్లు కోరుకొండ రాజేశ్వరి, జగడం వెంకటగౌరీ పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరులకు ఊంజల్ సేవ



గౌరీపరమేశ్వరులకు ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి : స్థానిక గౌరీ పంచాయతన ఆలయంలో శుక్రవారం గౌరీపరమేశ్వరుల 188వ ఊంజల్‌సేవ నేత్రపర్వంగా జరిగింది. మళ్ల కాశీవిశ్వనాథ్ (చిన్నాజీ), భాగ్యమహాలక్ష్మి దంపతులచే అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషసాయి ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, పాలకవర్గ సభ్యులు, గౌరీగీతా మహిళా మండలి, శ్రీసత్తెమ్మతల్లి దేవస్థానం మహిళా మండలి సభ్యులు, గౌరీపరమేశ్వరి, అమృతవర్షిణి, పెతకంశెట్టి సుజాత తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్



హాజరైన డ్వాక్రా మహిళలు

అనకాపల్లి : సంక్షేమాభివృద్ధి యథావిధిగా జరగాలంటే రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డినే మళ్లీ గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ అన్నారు. 83వ వార్డు 5, 6 సచివాలయాల పరిధి లక్ష్మీదేవిపేట సీతారామ కల్యాణ మండపంలో శుక్రవారం డ్వాక్రా సంఘాల సభ్యుల సమావేశంలో మాట్లాడారు. సంఘ సభ్యులందరూ జగనన్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మహిళలందరూ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు బుద్ధ భాస్కర్, సన్నిబాబు, బుద్ధ వెంకటరావు, కొమ్మన శంకర్, గణేష్, ఆర్పీలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



ఓటు హక్కు వినియోగంపై మాట్లాతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

కశింకోట : ఎన్నికల్లో ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఆర్డీవో ఎ.జె. చిన్నికృష్ణ తెలిపారు. కశింకోటలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం స్వయం సహాయక సంఘాల మహిళలతో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేసి శత శాతం పోలింగ్ జరగడానికి దోహదపడాలన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఎన్నికల కమిషన్ అవసరమైన ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. తహసీల్దార్ కె. సురేష్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న తహసీల్దార్ అన్నాజీరావు తదితరులు

నర్సీపట్నం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జాతి నాయకుడు కాదని జాతీయ నాయకుడని తహసీల్దార్ అన్నాజీరావు అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో సామాజిక సమతా సంకల్ప మహోత్సవం ముగింపు సభ జరిగింది. ముందుగా అంబేడ్కర్ భారీ చిత్రపటానికి తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయ ఏవో సూర్యనారాయణ, డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబరు ఎం.అప్పలరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలు, మైనారిటీలు, అన్ని వర్గాల్లో అణగారిన ప్రజలకు రక్షణ కల్పించే విధంగా రాజ్యాంగాన్ని రచించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అని కొనియాడారు. అమరావతిలో 125 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయడం చరిత్రాత్మక నిర్ణయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు, డీవీఎంసీ సభ్యుడు రేబాక మధుబాబు, దళిత సేవా పరిరక్షణ నాయకులు యాదగిరి దాసు, ఎల్లాజీ, హౌసింగ్ ఏఈ నాయుడు, వసతి గృహం సంక్షేమ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు అడిదెల బాబూరావు పాల్గొన్నారు.

మండల స్థాయి కబడ్డీ విజేత ధర్మసాగరం



విజేత జట్టుతో నాయకులు

నర్సీపట్నం: ఆడుదాం-ఆంధ్రా మండల స్థాయి కబడ్డీ పోటీల్లో ధర్మసాగరం జట్టు విజేతగా నిలిచింది. నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఫైనల్లో బయపురెడ్డిపాలెం జట్టుతో తలపడగా, హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో ధర్మసాగరం విజయకేతనం ఎగురవేసింది. సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు, ఎంపీడీవో జయమాధవి క్రీడాకారులను అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

అల్లిపురం (విశాఖ దక్షిణ) : వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అనకాపల్లి జిల్లా, చీడికాడ మండలానికి చెందిన పోతల కొండబాబు జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌లో కలాసీగా పని చేస్తున్నాడు. అతను కుటుంబంతో కలిసి అల్లిపురంలోని బంగారమ్మమెట్టలో జీవిస్తున్నాడు. సంక్రాంతి పండగ సందర్భంగా కుటుంబంతో సొంత గ్రామమైన చీడికాడ వెళ్లి గురువారం సాయంత్రం తిరిగి వచ్చాడు. అనంతరం భార్య చెల్లయ్యమ్మతో గొడవ పడి మద్యం తాగి వచ్చాడు. రాత్రి కుటుంబం అంతా భోజనాలు చేసి నిద్రపోయారు. శుక్రవారం తెల్లవారి 6 గంటల సమయంలో చెల్లయ్యమ్మ లేచి చూసే సరికి ఇంటి గ్రిల్ పైన రాడ్డుకు ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో ఆమె చుట్టుపక్కల వారిని పిలిచింది. సమాచా రం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని భార్య చెల్లయ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి కుటుంబానికి 100 రోజుల పని దినాలు



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి

కె.కోటపాడు: ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డుదారులకు ఏడాదికి వంద రోజుల పని దినాలను కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం కె.కోటపాడులో గ్రామీణ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు పథకం, ఉపాధి హామీ, హౌసింగ్, వ్యవసాయ శాఖ, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న పథకాలపై అధికారులు వివరించారు. జల జీవన్ మిషన్ పథకం ద్వారా మండలంలో ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిని ఏర్పాటు చేస్తున్నట్లు జేఈ అల్లు శ్వేత తెలిపారు. గర్భిణులు, బాలింతల మెరుగైన ఆరోగ్యం కోసం పౌష్టికాహారం అందిస్తున్నట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, హౌసింగ్ ఏఈ నాయుడు, వ్యవసాయాధికారి సోమశేఖర్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు అవసరం

మునగపాక: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు అవసరమని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈవోఆర్డీ వెంకటలక్ష్మి అధ్యక్షతన గ్రామాభివృద్ధి ప్రణాళికలపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పన్నుల వసూలు, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై దృష్టిసారించాలన్నారు. వెలుగు ఏపీఎం కొండమ్మ, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి చెందిన భారత్.. ప్రధాని మోదీ కల



ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేస్తున్న రామునాయుడు

సబ్బవరం: అన్ని రంగాల్లో భారత్‌ను అభివృద్ధి చేయడమే ప్రధాని నరేంద్ర మోదీ కల అని, దాన్ని సాధించడం కోసం ప్రతి ఒక్కరూ ఆయనకు మద్దతుగా నిలవాలని బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లి రామునాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని తవ్వవానిపాలెం, అమృతపురం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామ సభలో ఆయన కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. కుటుంబాలు వ్యక్తిగతంగా అభివృద్ధి చెందడం ద్వారా గ్రామాలు, మండలాలు, జిల్లాలు, రాష్ట్రాలు ప్రగతి పథంలో పయనించి దేశాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను ప్రజలకు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ



చినపాచిలలో ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు, ధార్మిక సంఘాల సభ్యులు

రావికమతం: అయోధ్య రాముని అక్షింతల పంపిణీ కార్యక్రమం శుక్రవారం చినపాచిలలో నిర్వహించారు. గ్రామంలో వైష్ణవీ మాత ఆలయం నుంచి భారీ ర్యాలీగా ప్రధాన వీధుల్లో తిరిగారు. వెండి, రాగి కలశాలతో అక్షింతలను ఊరేగించారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం 500 మంది సభ్యులు, భజన మండలి ప్రతినిధులు గ్రూపులుగా విడిపోయి ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. గ్రామ నాయకులు, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి

దేవరాపల్లి: గ్రామ పంచాయతీలను మరింత అభివృద్ధి చేసే దిశగా పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో అభివృద్ధి ప్రణాళిల తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీ, బ్లాక్ స్థాయి అభివృద్ధి ప్రణాళికల తయారీకి అవసరమైన సలహాలు, సూచనలు స్వీకరించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు, ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి జి.వి.రమణ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని తదితరులు పాల్గొన్నారు.